పార్టీని మరింతగా బలోపేతం చేద్దాం


మాట్లాడుతున్న హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌రెడ్డి


గుడిబండ మండలం జంబులబండలో మాట్లాడుతున్న ఈరలక్కప్ప


రొళ్ల: రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌రెడ్డి

మడకశిరరూరల్: అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తోందని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం హెచ్‌ఆర్ పాళ్యం గ్రామంలో పంచాయతీ ఇన్‌చార్జ్ హనుమంతు, ఎంపీపీ కవిత అధ్యక్షతన జరిగిన రచ్చబండ కార్యక్రమంలో రమేష్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి నర్సేగౌడ్, రాష్ట్ర ఆర్గనైజేషన్ యాక్టివిటీ కార్యదర్శి, పీఏసీ సభ్యులు వజ్రా భాస్కర్‌రెడ్డి , రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ, రాష్ట్ర కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, రాష్ట్ర వైఎస్సార్ మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ భారతీరెడ్డి, జిల్లా అధికారి ప్రతినిధి ఆనందరంగారెడ్డి, మండల కన్వీనర్ రామిరెడ్డి తదితరులు హాజరయ్యారు. రమేష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పార్టీని మరింత బలోపేతం చేసేలా పనిచేయాలన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్య పడవద్దన్నారు. వజ్రా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. పార్టీ పటిష్టతకు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ జయపద్మ, ఎంపీటీసీ కామరాజు, పట్టణ ఉపాధ్యక్షురాలు అంజలి, జెడ్పీటీసీలు ఆనంతరాజు, భూతరాజు, న్యాయవాది అశ్వర్థనారాయణ, హల్కూరు కాంతరాజు, సురేష్, సత్యనారాయణ, తిమ్మప్ప, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: మండలంలోని పది పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో పంచాయతీ స్థాయి అధ్యక్షతల ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. బీజీ హళ్లి, మల్లినమడుగు పంచాయతీ కేంద్రంలో జరిగిన రచ్చబండ కార్యక్రమానికి మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడు, దొడ్డేరి, రొళ్ల, ఎం.రాయాపురం పంచాయతీ కేంద్రంలో జరిగిన రచ్చబండ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, మండల ఇన్‌చార్జ్ నాగమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారం కోసం సీఎం చంద్రబాబు ఆచరణకు సాధ్యం కాని హామీలను ఇచ్చి ప్రజలను మోసగించారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు నాగేంద్ర, నగేష్‌రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండలంలో గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీ బలోపేతం చేద్దామని పంచాయితీల ఇన్‌చార్జ్‌లు విజ్ఞప్తి చేశారు. ఆదివారం మండల పరిధిలోని గ్రామ పంచాయతీల కేంద్రాల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలు, వివిధ పథకాల్లో జరుగుతున్న అవినీతి గతంలో పనులు చేసిన మంజూరు కానీ బిల్లు తదితర వాటిపై చర్చించి తీర్మాణాలు చేశారు. రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ, రాష్ట్ర కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి, రాష్ట్ర కుంచిటి వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ రామిరెడ్డి తదితరులు మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గ గ్రామ, వార్డు కమిటీలు రాష్ట్ర స్థాయిలోనే మడకశిర పైలెట్ ప్రాజెక్టుగా నిలిచే విధంగా గ్రామ స్థాయిలో పని చేసి పార్టీ బలోపేతం చేయలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి నరసింహామూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణ, తాలుకా యువజన విభాగం అధ్యక్షులు శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: ప్రస్తుత కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజా పక్షాలన నిలబడటానికే రచ్చబండ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు , మండల ఇన్‌చార్జ్ గంగుల సుధీర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి వాగేష్, ఎంపీపీ ఈరన్న, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ పేర్కొన్నారు. ఆదివారం వివిధ పంచాయతీ కేంద్రాల్లో రచ్చబండ కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్క హామీని కూడా కూటమి ప్రభుత్వం సరిగ్గా అమలు చేయడం లేదని విమర్శించారు. కూటమి మోసాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పంచాయతీ అధ్యక్షులు మోహన్, నాగేంద్రప్ప, సదానందగౌడ, జోగింద్ర, రవికుమార్, నాగేంద్రప్ప, రవి, శివకుమార్, ఏషణ్ణ, రవీంద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పార్టీ నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ భారతిరెడ్డిదేశాయి తెలిపారు. పట్టణంలోని 20 వార్డుల పరిధిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాలు జరిగాయి. పట్టణ కన్వీనర్ వాల్మీకి సతీష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన రచ్చబండ కార్యక్రమాలు అన్ని వార్డుల పరిధిలో విజయవంతంగా జరిగాయి. మాజీ మున్సిపల్ చైర్మన్ జయరాజ్, మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, కౌన్సిలర్లు తిమ్మక్క, అంజన్, అన్సర్, శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యులు ఫక్రుద్దీన్, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ప్రజలకు వివరిద్దాం


అగళి: రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

అగళి: ముఖ్యమంత్రి చంద్రబాబు మోసానికి మారుపేరని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. ఆదివారం మండల పరిధిలోని 13 పంచాయతీల్లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'లో భాగంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వైఫల్యాలు ఇంటింటికీ తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర కీలకమన్నారు. సుపరిపాలన అంటూ మళ్లీ జనాన్ని మోసం చేయడానికి వస్తున్నారని, మళ్లీ మోసపోవద్దని సూచించారు. రాష్ట్రంలో వృద్ధులు, దివ్యాంగులకు ఇస్తున్న పింఛన్లను అన్యాయంగా తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబు మోసాలు, అన్యాయాలు, అక్రమాలను ప్రశ్నిస్తే తప్పడు కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి చంద్రబాబు మోసాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, అగళి మండల పార్టీ పరిశీలకులు సాయిలీల, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, సర్పంచులు శివకుమార్, ముద్దరాజు, రామకృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు పర్యవేక్షణలో నూతనంగా ఎన్నికైన ఆయా పంచాయతీ అధ్యక్షుల ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఉన్న ప్రతి పంచాయితీలో రచ్చబండ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసి కష్టాల్లోకి నెట్టేస్తారన్నారు. అనంతరం గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ప్రజలతో చర్చించారు. కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ పరిశీలకడు రమేష్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కాంతరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, అమరాపురం మండల కన్వీనర్ త్రిలోక్, మండల ప్రధాన కార్యదర్శి పాండు తదితరులు పాల్గొన్నారు.


మడకశిర మండలం ఆర్ అనంతపురంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి


మడకశిర: 10వవార్డులో రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న భారతిరెడ్డి దేశాయి, వైఎస్సార్‌సీపీ నాయకులు


హలుకూరులో తీర్మాన పత్రాన్ని అందిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గంగుల సుధీర్‌రెడ్డి

క్లుప్తంగా

నిబంధనలు పాటించకపోతే చర్యలు


మాట్లాడుతున్న డీఎస్పీ మహేష్

హిందూపురం: వినాయక చవితి సందర్భంగా హిందూపురం డివిజన్‌లో గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు కచ్చితంగా అనుమతులు తీసుకోవాలని డీఎస్పీ మహేష్ తెలిపారు. ఆదివారం డీఎస్పీతో పాటు పట్టణ సీఐలు రాజగోపాల్‌నాయుడు, అబ్దుల్‌కరీంలతో కలిసి మాట్లాడారు. నిబంధనలకు అనుగుణంగా వేడుకలు నిర్వహించాలని, హద్దు మీరితే చర్యలు తప్పవన్నారు.

యాచకుడి మృతి


మృతి చెందిన యాచకుడు

పావగడ: పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలోని రాజ నందన్ హోటల్ వెనుక భాగంలో అంగ్లల సముదాయం ఎదుట గుర్తు తెలియని యాచకుడు (45) ఆదివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు పావగడ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందివ్వాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు పరామర్శ


మాజీ సర్పంచ్ నారాయణరెడ్డిని పరామర్శిస్తున్న రమేష్‌రెడ్డి

మడకశిరరూరల్: మండలంలోని మెళవాయిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, మాజీ డీలర్ సత్యనారాయణరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆదివారం సాయంత్రం హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌రెడ్డి వారి ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించారు. అలాగే కొత్తలం గ్రామానికి చెందిన నరసింహప్ప అనారోగ్యంతో బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మండల కన్వీనర్ రామిరెడ్డి, నాయకులు శ్రీరామిరెడ్డి, నాగభూషణరెడ్డి పరామర్శించారు.

వీరభద్రుని సేవలో సీబీఐ న్యాయమూర్తి


న్యాయమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

లేపాక్షి: మండల కేంద్రంలోని వీరభద్ర స్వామి దేవాలయాన్ని కర్ణాటక సీబీఐ న్యాయమూర్తి గజానన్ భట్ దంపతులు ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ వారికి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు చేయించారు. ఎస్ఐ నరేంద్రతో పాటు స్థానిక అధికారులు వారి వెంట ఉన్నారు.

డీసీసీ బ్యాంక్ డైరెక్టర్‌గా వెంకటేష్

పావగడ: తుమకూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ డైరెక్టర్‌గా స్థానిక ఎమ్మెల్యే హెచ్ వి వెంకటేష్ ఘన విజయం సాధించారు. తుమకూరులోని డీసీసీ బ్యాంక్ కార్యాలయంలో ఆదివారం డైరెక్టర్ స్థానానికి జరిగిన ఎన్నికల్లో వెంకటేష్ 14 ఓట్లతో విజయ భేరి మోగించారు. వెంకటేష్ విజయం పట్ల స్థానిక కాంగ్రెస్ నాయకులు స్థానిక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ సుదేశ్ కుమార్, మాజీ చైర్మన్లు పిహెచ్ రాజేశ్, ఏ శంకరరెడ్డి, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా వెండి పల్లకీ ఉత్సవం


వెండి పల్లకీలో శనీశ్వరస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో నిర్వహించిన శ్రావణ మాస వేడుకల ముగింపు సందర్భంగా శాంత స్వరూపుడు శనీశ్వర స్వామి, జేష్ఠాదేవిని వెండి అడ్డ పల్లకీలో ఘనంగా ఊరేగించారు. వందలాది మంది భక్తులు ఊరేగింపులో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిక


పార్టీలో చేరిన వారికి కండువేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు

రొళ్ల: మండల పరిధిలోని ఎం.రాయాపురం గ్రామ సమీపంలోని ఎంఆర్ గొల్లహట్టి క్రాస్ వద్ద వెలసిన ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం పంచాయతీ అధ్యక్షుడు సీఎం ఘట్ట రవి ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హనిసేకుంటకు చెందిన టీడీపీ నాయకుడు నాగరాజు తన అనుచరులతో సహా వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలోకి కొత్తగా చేరిన వారికి జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, మండల ఇన్‌చార్జ్ నాగమణి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, సర్పంచ్ నరసింహప్ప, ఎంపీటీసీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

సోమందేపల్లి: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. రూ.15 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.

వినాయక ఉత్సవానికి విరాళం


విరాళం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంతరాజు

అమరాపురం: మండల కేంద్రంలోని పాత ఎస్సీ కాలనీ, ఆర్డీటీ కాలనీలో నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలకు తనవంతు సహాయంగా వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు రూ.35 వేలు నగదును ఉత్సవ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. డాక్టర్ బీఆర్. అంబేద్కర్ స్మృతి వనంలో ఆయన విరాళాన్ని అందించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న టీజీ హైకోర్టు న్యాయవాది

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున వెలసిన పురాతన రొద్దకాంబదేవి ఆలయ నిర్మాణానికి మండల పరిధిలోని ఆర్ మరువపల్లికి చెందిన తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది ఆర్‌ఏ హేమేంద్రనాథ్‌రెడ్డి రూ. 2 లక్షలు విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

పెనుకొండ: నరాల బలహీనతపై వయోవృద్ధులు, ప్రజలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ లిఖిత్‌రాంనాయక్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో ఆదివారం నరాలు, ఎముకలకు సంబంధించి ఉచితంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

శాస్త్రీయతను పెంపొందించుకోవాలి


మార్చ్ ఫర్ సైన్స్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

హిందూపురం: విద్యార్థులు మూఢనమ్మకాలకు స్వస్తిపలికి శాస్త్రీయతను పెంపొందించుకోవాలి. తద్వారా దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఏఐడీఎస్ఓ ఇన్‌చార్జి మల్లిక్‌దత్ కుమార్ అన్నారు. ఇండియా మార్చ్ ఫర్ సైన్స్ ఐఎంఎఫ్ఎస్ ఆర్గనైజేషన్ ద్వారా వాల్మీకి సర్కిల్ మీదుగా చిన్న మార్కెట్ పొట్టిశ్రీరాములు సర్కిల్ వరకూ సైన్స్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో శేఖర్ అకాడమి కరస్పాండెంట్ చంద్రశేఖర్, ఏఐడీఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్, సభ్యులు పూజిత, జయచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గస్థాయి సమావేశం

మడకశిర: పట్టణంలోని వేమన సర్కిల్‌లో (ఆదిరెడ్డిపాళ్యం) ఉన్న షాదీమహల్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గస్థాయి వైఎస్సార్‌సీపీ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, పార్లమెంట్ ఇన్‌చార్జ్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి (యాక్టివిటీ) వజ్ర భాస్కర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రతినిధి జీను మహేష్ పాల్గొంటారని పేర్కొన్నారు. పంచాయతీ ఇన్‌చార్జ్‌లు, పంచాయతీ అధ్యక్షులు పరస్పరం చర్చించుకుని తీర్మానాలు, కమిటీల పూర్తి వివరాలను సమావేశానికి తీసుకుని రావాలని కోరారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

ఆర్డీటీకి అన్యాయం చేస్తే ఉద్యమం


మాట్లాడుతున్న బీఎస్ఆర్ దాస్

పెనుకొండ: ఆర్డీటీకి అన్యాయం చేస్తే ఉద్యమం తప్పదని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు బీఎస్ఆర్ దాస్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర పేదల కుటుంబాల్లో ఆర్డీటీ వెలుగు నింపిందన్నారు. అలాంటి సంస్థకు ఎఫ్‌సీఏఆర్ లేకుండా చేయడం దారుణమన్నారు. మంచికి సహకారం అందించాల్సిన కేంద్రం ఇలా షరతుల పేరుతో పేదలకు ఇబ్బందులు కలిగించడం దారుణమన్నారు. ఆర్డీటికి న్యాయం చేయక పోతే పెద్ద ఎత్తున ఆందోళన తప్పదన్నారు. నాయకులు శివరామకృష్ణ, ఎంఎస్. మూర్తి, రామాంజినేయులు, గంగాధర్, శ్రీరాములు, కిష్ట. సూరి, గంగాధర్, హరి, తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్‌కు చేరిన నంబులపూలకుంట జట్టు

పెనుకొండ: యూటీఎఫ్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నంబులపూలకుంట – హిందూపురం జట్లు తలపడ్డాయి. నంబులపూలకుంట జట్టు 11 పరుగుల తేడాతో హిందూపురం జట్టును ఓడించి ఫైనల్‌లోకి దూసుకెళ్లింది.

ప్రైవేట్ స్కూల్ వద్ద విద్యార్థి సంఘాల ధర్నా


నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు

పెనుకొండ: పట్టణంలోని ఘనగిరి స్కూల్ వద్ద ఏఐఎస్ఏ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్నారని, దీనివల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అదే విధంగా చెప్పిన పాఠాలనే పదే పదే చెప్పిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు శివకుమార్, బాబావలి, హర్షకుమార్, పునీత్ భగత్ తదితరులు పాల్గొన్నారు.


అపరిశుభ్రంగా మారిన జాతీయ రహదారి

హైవేపై మురుగు కంపు

పెనుకొండ రూరల్: జాతీయ రహదారిపైనే మురుగు కంపు కొడుతోంది. అమ్మవారిపల్లిలోని నరసింహస్వామి దేవాలయం వెనుక నుంచి కియా పోలీస్‌స్టేషన్ ముందు నుంచే జాతీయ రహదారిపైకి మురుగు నీరు ప్రవహిస్తోంది. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు సైతం ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అసలే వర్షాకాలం కావడంతో దోమలు సైరహారం చేస్తున్నాయి. ఇటీవల భవన నిర్మాణాలు విపరీతంగా పెరిగిపోవడం.. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో సమస్య తలెత్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని పలువురు గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.


హేమావతి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు


రాగిమేకులపల్లి ప్రాథమిక పాఠశాలలో..

అ'పూర్వ' సమ్మేళనం

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 2007 –08 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట చేరి సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు.

రొద్దం: మండల పరిధిలోని రాగిమేకులపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 1996–2003 మధ్య ఏడో తరగతి చదివిన వారు పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.